# కోరిక

చెల్లూరి సీతారామేశ్వరరావు



రంగారావు టిఫిన్ పూర్తి చేశాడు. కోమలి యింకా కాఫీ తీసుకురాలేదు. టీపాయ్‌మీది పేపరు తిరగెయ్యసాగేడు.

"డాడీ! టాటా!" రాజు, వాగిని చెప్పి, స్కూల్‌కి వెళ్ళిపోయారు.

"ఇదిగో కాఫీ!"

కోమలి కాఫీ యిచ్చి వెళ్ళిపోలేదు. అక్కడే నిలబడి వుంది. రంగారావు గమనించనట్లే కాఫీ త్రాగసాగేడు.

"రేపు నా పుట్టినరోజు" చెప్పింది.

సినిమాల్లోలా 'హేపీ బర్త్‌డే టూ యూ' అని రాగం తీయలేదు రంగారావు. కోమలికేసి సీరియస్‌గా చూశాడు.

పెళ్లయిన కొత్తలో యిదేమాట పనస తొనలా వుండేది పుష్కరం దాటింది కనుక ఆ మాట ఇప్పుడు పంచదార తక్కువైన పాయసంలా వుంది. రెండు రెళ్ళు నాలుగని ఎంత టక్కున తెలుస్తుందో, పుట్టినరోజనగానే క్లాత్ షోరూంకి పరుగెత్తాలని రంగారావుకి తెల్సిపోయింది.

రంగారావు గుర్రుమన్నాడు గొణిగాడు గర్జించాడు.

"ఇంకా సంక్రాంతి వెళ్లి పదిరోజులు కాలేదు. అప్పుడుకొన్న చీర కట్టుకో!"

"పుట్టిన రోజు నాడు పాతదా!"

"నీ పుట్టినరోజింత ఘనమైనది కాదు. పుట్టి ఎవర్ని వుద్ధరించావ్ !"

"మిమ్మల్ని పెళ్లిచేసున్నాను కదా!"

"లేకపోతే నాకు పెళ్లికాదా?"

సంభాషణ సమరంలోకి దిగింది. చివర్న కోమలి 'చీర ఎలా కొనరో చూస్తాను?' మెజారిటీ వున్న సియంలా సవాల్‌చేసింది.

రంగారావుది పుస్తకాల వ్యాపారం. లాభాలు పెరగడంతో బాదుడు ఎక్కువయిపోతోంది పెళ్లాం ఏదిచెప్పినా దుబారాక్రిందే కనిపిస్తోంది.

రంగారావు సిటీబస్‌కోసం స్టాప్‌లో వించున్నాడు. అక్కడో విచిత్రం జరిగింది. ఆ వూళ్లో బస్సులు స్టాప్స్‌లో ఆగవు పడుస్తుండగానే ఎక్కాలి. రంగారావు పరుగెత్తినా ఎక్కలేకపోయాడు. ఎర్రటి పర్సు అతడి కాళ్ల ముందు పడివుంది.

ఎవరిదో ననుకుంటూ పర్స్ పరిశీలించాడు. కొత్త యాభైనోటుంది. అడ్రస్ స్లిప్ లేదు. పోగొట్టుకున్న దురదృష్టవంతుడి పైసానుభూతి కలిగింది. ఎవరయిన వచ్చి అడుగుతారని అరగంట చూశాడు ఎవరూ రాలేదు. పుస్తకాల షాపుకి వెళ్లిపోయాడు

రంగారావుకి కొన్ని సెంటిమెంట్లున్నాయి. అన్యాయం అచ్చిరాదని నమ్ముతాడు. షాపుకి చేరుకోగానే కొత్త ఆలోచన వచ్చింది.

రంగారావు యాభైనోటు భగవద్గీతలో పెట్టాడు. ఇది కొన్నవారికి ఈ లక్ష్మి వరిస్తుంది."

రోజులా కాకుండా రంగారావు పుస్తకాలు కొనడానికి వచ్చిన వార్ని థ్రిల్లింగ్‌గా చూస్తున్నాడు. నవల్లు, మ్యాగ్‌జైన్లు కొనేవారేకాని. భగద్గీత ఎవరూ అడగడంలేదు

మూడున్నరకి ఓ ముసలాయన గీత కావాలని వచ్చాడు రంగారావు యాభైనోటువున్న పుస్తకం చూపించాడు. 'యాభై నీదే' అనుకున్నాడు. కాని కృష్ణుని బొమ్మ సరిగ్గాలేదని, ఆ పుస్తకం వద్దని మరోటి కొనుక్కున్నాడు. 'బ్యాడ్‌లక్' రంగారావనుకున్నాడు.

చీకటిపడిన తర్వాత పదేళ్ల కుర్రాడు భగవద్గీత కావాలని వచ్చాడు. రంగారావు రెండుమూడు రకాల పుస్తకాలు చూపించాడు అదృష్టం. కుర్రాడు యాభైనోటువున్న గీత తీసుకున్నాడు.

"లక్కీఫెలో" అనుకున్నాడు.

తొమ్మిదింటికి భోజనానికి కూర్చున్నాడు. కోమలి కొత్తచీర చూపిస్తూ "ఎలావుందండీ?" అంది.

"ఎక్కడిది?" అనుమానంగా అడిగాడు




"మధ్యాహ్నం మన ప్రక్కయింటి బాబాయిగారు గీతకావాలని వచ్చి డబ్బిచ్చారు. మీరు మధ్యాహ్నం భోజనానికి రాలేదాయె. సాయంత్రం బాబాయిగారు మళ్లీవచ్చారు. అప్పుడు కనకమ్మగారి తమ్ముని కొడుకుకి డబ్బిచ్చి మనకొట్టుకు పంపించాను వాడు తెచ్చిన పుస్తకంలో యాభైనోటుంది. వాడు పెట్టి మరచిపోయాడని అడిగాను వాడిదికాదన్నాడు మీరు పంపించి వుంటారని చీరకొనేసుకున్నాను. మీకు ప్రథమ కోపమేగాని పుట్టినరోజుకి చీరకొనకుండా వుంటారా?"

కోమలి ఓరగా దోరగా నవ్వింది.

"అదృష్టవంతుడ్ని చెరపలేరు ఎవ్వరూ!" రంగారావు తర్కించుకున్నాడు

కోమలి కోరికతీరింది

---

వచ్చే సంచికలో పూర్తి నవల

## మంచు మంట

రచయిత్రి: కాకాని కమల